# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 06 మార్చి 2025


## వేసవికాలంలో నీటి సమస్యలేకుండా చూడాలి

: మున్సిపల్ అధికారులతో సమావేశమైన చైర్మన్

బద్వేలు అర్బన్, మార్చి 5 (ప్రభాతవార్త):



రాబోయే వేసవి కాలంలో మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, డిఈ సుమన్ రెడ్డి, మేనేజర్ సుధీర్, అసిస్టెంట్ ఇంజనీర్లు మహేష్‌బాబు పలువురితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడా కూడా నీటి సమస్య లేకుండా చూడాలని అలాగే లైటింగ్, హౌసింగ్‌తో పాటు వివిధ అభివృద్ధిపనులను వేగవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రజలకు మెరుగైన సేవలందించేలా కృషిచేయాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు మున్సిపల్ శాఖ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతలు అరెస్ట్

ప్రొద్దుటూరు, మార్చి 5, ప్రభాతవార్త:



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి నగదు, గంజాయి స్వాధీనం చేసుకున్నామని టూ టౌన్ సిఐ యుగంధర్ తెలిపారు. బుధవారం ఈ విషయమై ఆయన మాట్లాడుతూ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు పక్కన ఉన్న సాయి శ్రీ లేఔట్ వద్ద మంగళవారం గంజాయి విక్రయిస్తున్న గోకుల్ నగర్ కు చెందిన షేక్ కాజా పీర్, దస్తగిరి పేటకు చెందిన పల్లె ప్రశాంత రావు, తలారి మైకేల్ బాబు అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 1100 గ్రాముల గంజాయి మరియు 13 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీరిలో ప్రశాంత్ మరియు మైఖేల్ లపై గతంలో పలు మట్కా కేసులు మరియు గంజాయి కేసులు కూడా నమోదు అయి ఉన్నాయని, వీరిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించామని తెలిపారు.

# సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించండి

కడప మార్చి 5 : ప్రభాతవార్త



గ్రామ,పట్టణ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు,అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు.బుధవారం కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్ హాలులో ఆరోగ్యశ్రీ, అనుబంధ ఆస్పత్రులు ,పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆరోగ్య సూచికలు, వైద్య శాఖ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని.. వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనిదీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ లలో ప్రస్తుత స్టేటస్ ఓపి,ఐపి, డెలివరీలు, ఇమ్యూనైజేషన్ వంటి రోజువారి డేటాను నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క పీ.హెచ్.సి సెంటర్లోని వైద్యాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. పీ.హెచ్.సి పరిధిలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందించేలా పనిచేయాలన్నారు. వైద్యాధికారులు క్రమం తప్పకుండా ప్రతిరోజు విదులకు హాజరవుతూ క్రింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు,అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఉత్తమమైన మౌలిక వసతుల సదుపాయాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ నిబద్ధతతో తమ కర్తవ్యాన్ని నిర్వహించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందే వైద్య సేవలు, వైద్యాధికారుల పనితీరు, ఆరోగ్య కేంద్రాల్లో ఓపి ల నమోదు సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. ప్రణాళికా ప్రకారం సుఖ ప్రసవాలు ఇమ్మునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతృ, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు,తదితర ఆరోగ్య సేవలపై వైద్యాధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఒపి, ఐపి,ల్యాబ్ టెస్టు, డెలివరీ వంటి ఆరోగ్య సేవలలో తి గ్రేడ్ సాధించి రాష్ట్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్ లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పర్ఫామెన్స్ ఇండికేటర్స్ లో మంచి ప్రతిభ చూపిన వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు మూడు నెలల ప్లాన్ అఫ్ యాక్షన్ పైన పి పి టి ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే హెల్త్ ప్రోగ్రామ్స్ ప్రత్యేక దృష్టి సారించి వెనుకబడిన పారామీటర్స్ లను మెరుగుపరుచుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారుఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ బాలంజనేయులు,డిసీహెచ్ఎస్ ఇన్చార్జి కరిముల్ల , కడప డిప్యూటీ డిఎంహెచ్ఓ ఉమా మహేశ్వర రావు,బద్వేల్ డిప్యూటీ డిఎంహెచ్ఓ మల్లేష్,పులివెందుల డిప్యూటీ ఖాజా మొయినుద్దీన్, జమ్మలమడుగు డిప్యూటీ డిఎంహెచ్ఓ శివ ప్రసాద్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు,తదితరులు పాల్గొన్నారు.

# సామరస్యంతో మెలగాలి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి మార్చి 5 ప్రభాత వార్త



మత సామరస్యానికి, ప్రశాంతతకు ప్రతీక రాయచోటి అని మత విద్వేషాలకు అతీతంగా సామరస్యం, సోదరభావంతో ప్రతి ఒక్కరు మెలగాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలో మంగళవారం జరిగిన ఘటన బాధాకరమన్నారు. కొంత మంది ఆకతాయిలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడమే కాకుండా ఇతరులకు అసౌకర్యం కలిగించడం బాధాకరమన్నారు. శాంతియుతంగా కార్యక్రమాలు జరుపుకోవాలే తప్ప రెచ్చగొట్టే విధానాలతో ఇతరులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు పోలీసులు సమన్వయంతో సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలందరూ సామరస్యంతో మెలగాలని ఆయన కోరారు. ఇరు వర్గాలకు చెందిన కొంత మంది ఆకతాయిలు అసంబద్ధమైన నినాదాలతో రెచ్చగొట్టి దాడికి పాల్పడడం మంచిది కాదన్నారు. ఇప్పటికప్పుడు పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతూ ఎవరికైనా ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించామన్నారు కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణం కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది. ప్రస్తుతం రాయచోటి పట్టణంలో ప్రశాంత వాతావరణం ఉంది. ఈ పరిస్థితిని చెడగొట్టడానికి కొంత మంది సత్యదూరం, అసంబద్ధమైన పుకార్లను వ్యాప్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు ప్రత్యేకమైన నిఘా పెట్టి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలందరూ సంయమనంతో మెలగాలి.

## రూ.549కోట్లతో హంద్రీ-నీవా లైనింగ్ పనులు

హెచ్ఎన్ఎస్ ఎస్ఈ ఆర్.విఠల్‌ప్రసాద్

మదనపల్లె, మార్చి 5 ప్రభాతవార్త :



ఎస్ఈ విఠల్‌ప్రసాద్

హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచ్‌కెనాల్, కుప్పం బ్రాంచ్ కెనాల్ లైనింగ్, వైడింగ్ పనులు రూ.549కోట్లతో శరవేగంగా జరుగుతున్నట్లు హెచ్ఎన్ఎస్ ఎస్ఈ ఆర్.విఠల్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన హెచ్ఎన్ఎస్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని హంద్రీ-నీవా కాలువ పనులు శరవేగంగా చేపట్టి మే 31లోపు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి నాగార్జున కన్‌స్ట్రక్షన్ వారు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి రిత్విక్ ప్రాజెక్టు వారు పనులు చేపడుతున్నారన్నారు. పనులు పూర్తి కాగానే ఈ ఏడాదిలోని శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత వాసులకు తాగు, సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. తంబళ్ళపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలతో పాటు చిత్తూరుజిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గంలోని రైతాంగానికి హంద్రీ-నీవా నీరు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. 20ఏళ్ళ క్రితం హంద్రీ-నీవా కాలువ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. పెండింగ్‌లో ఉన్న చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్, గుంటివారిపల్లె సమ్మర్‌స్టోరేజ్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. లైనింగ్ పనులు చేపట్టడం వల్ల కాలువల్లో హంద్రీ-నీవా జలాలు వేగవంతంగా ప్రవహించడమే కాకుండా నీరు ఎక్కడా వృధా కావన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. పనుల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే హంద్రీ-నీవా అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. అనంతపురం జిల్లాలోని కదిరి సమీపం నుంచి కాలువ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హంద్రీ-నీవా డిప్యూటి సూపరిండెంట్ లింగారెడ్డి, ఈఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఒక వైపు చైతన్యం..! మరోవైపు జాగ్రతలు..!!

- నేరాల అదుపునకు పటిష్టంగా నిఘా వ్యవస్థ.. - మహిళల స్వీయరక్షణకు ప్రాధాన్యతా చర్యలు - ప్రజలను అప్రమత్తం చేస్తూ సవ్యసాచిలా అన్నమయ్య జిల్లా ఎస్పీ



మహిళా రక్షణపై కళాశాల విద్యార్థినిలకు, మహిళా పోలీసులకు సెమినార్ నిర్వహిస్తున్న పోలీసులు



లింగ సమానత్వంపై విద్యార్థినిలకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు వినూత్న శైలిలో పోలీసు వ్యవస్థను ముందుకు తీసుకెళుతున్నారు. నేరాల అదుపే కాదు.. ప్రజల్లో చైతన్యం, మోసపోకుండా జాగరూకులవ్వాలన్న లక్ష్యంతో జిల్లా పోలీసు వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గతంలో లేని విధంగా పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడే విధంగా అనేక చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రజలను అన్ని విధాలుగా చైతన్యపరచడం లాంటి వినూత్న చర్యలు జిల్లా ఎస్పీ చేపడుతున్న వైనంపై వార్త ప్రత్యేక కథనం..**

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)

అన్నమయ్య జిల్లాలో గతంలో లేని విధంగా ప్రజల చేరువకు పోలీసు వ్యవస్థను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు తీసుకెళుతున్నారు. హక్కుల సాధనతో పాటు సమాజం పట్ల బాధ్యతతో ప్రజలు మెలిగేలా చైతన్యం తీసుకొచ్చే లక్ష్యంతో ఎస్పీ పనితీరు సుస్పష్టంగా కనబడుతుంది. తద్వారా నేరాలు చాలావరకు అదుపులోకి వస్తాయని ఎస్పీ భావిస్తున్నారు. విజిబుల్ పోలీసింగ్‌తో పోలీసులను ప్రజల దరికి చేర్చడం, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ తో నిఘా వ్యవస్థను పటిష్టపరచడం, అన్నమయ్య పోలీసు వాట్సఫ్ ఛానల్ ద్వారా ప్రజలను అన్ని విధాలుగా చైతన్యపరచడం లాంటి వినూత్న చర్యలు ఇప్పటికే మొదలయ్యాయి. అన్నింటికి మించి ప్రజల్లో పోలీసువ్యవస్థపై విశ్వాసాన్ని కల్పించేందుకు ఇప్పటికే జిల్లాలోని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం కూడా పూర్తయ్యింది. పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా పోలీసులను సమన్వయపరుస్తున్నారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను ఎస్పీనే స్వీకరిస్తూ వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకోవడం కూడా జరుగుతుంద. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల చేరువకు పోలీసుశాఖను తీసుకెళ్ళేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా సేవా కార్యక్రమల్లో కూడా పోలీసుశాఖను భాగస్వామ్యులను చేసేందుకు స్వయంగా ఎస్పీనే పరకను చేతబట్టి చెత్తను ఊడ్చేందుకు కూడా వెనుకాడడం లేదు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగ సమానత్వాన్ని ప్రోత్సహించేందుకు పురుషుల ప్రమేయం యొక్క ఆవశ్యకత, పితృస్వామ్య నిబంధనలను సవాలు చేయడంపై జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో, హైస్కూల్స్‌లో విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నిర్వహించారు. పితృస్వామ్య నిబంధనలు అంటే స్త్రీలను అణచివేయడానికి, వివక్షతకు గురిచేయడానికి కారణమవుతాయి. పితృస్వామ్య నిబంధనలను సవాల్ చేయడం అనేది స్త్రీలను గౌరవించాలి, వారి హక్కులను గుర్తించాలి, సమాన అవకాశాలు కల్పించాలి, స్త్రీలపై జరిగే హింసను ఖండించాలి తదితర అంశాలు వస్తాయి. తద్వారా లింగ సమానత్వాన్ని సాధించడానికి ప్రజల్లో మార్పుకు తొలి అడుగు అని చెప్పవచ్చు. అంతేకాకుండా మహిళలకు తమ హక్కులు, భద్రత గురించి అవగాహన కల్పించేందుకు స్వీయ రక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చే అంశాలపై కూడా ఎస్పీ చర్యలు చేపట్టబోతున్నట్టు సమాచారం. ఇందుకోసం విద్యార్థినిలకు, మహిళా పోలీసులకు సెమినార్స్ కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రజల్లో చైతన్యం కోసం, చట్టాలపై అవగాహన ఏర్పడేందుకు పోలీసు వాట్సఫ్ ఛానల్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. పోలీసు ఛానల్ ద్వారా ప్రజలు మోసపోకుండా ఉండేందుకు అన్ని రంగాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇక ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ (ఎఐ) సాంకేతిక ఆధారంగా జిల్లాలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, శాంతి భ ద్రతలకు నిఘా వ్యవస్థను పటిష్టపరిచే దిశగా ఈ సాంకేతికతను శాంతి భద్రతల పరిరక్షణలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చన్న అంశాలపై సమీక్షిస్తున్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కూడా ఎస్పీ నిర్ణయం తీసుకున్నారు. ఎస్పీ తీసుకుంటున్న ప్రజారక్షణ చర్యలకు స్పందిస్తూ కొంతమంది దాతలు కూడా ముందుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారు. తాజాగా రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల అధినేత జిఎన్ నాయుడు సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతుగా రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నట్టు సమాచారం. చట్ట పరిధిలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలని జిల్లాలోని పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ వికలాంగులు, మహిళలు, వృద్ధులు, బాధిత ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పోలీసుశాఖకు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేశారు. విభిన్న సేవల ద్వారా పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలని భావిస్తున ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులిచ్చేందేకు వస్తున్న బాధితులకు ఎండలను దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ చేస్తుందడం విశేషం. అంతేకాకుండా మోసపుచ్చేందుకు అవకాశమున్న ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ప్రజలను చైతన్యపరిచేందుకు అప్రమత్త ం చేసేందుకు చేస్తున్న కృషి రానున్న రోజుల్లో ఫలించాలని ఆశిద్దాం.

## నాణ్యమైన విద్యను అందడమే ప్రభుత్వ ఉద్దేశ్యం



కడప, మార్చి 5 : ప్రభాతవార్త :

జీవో 117 ఉపసంహరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించడమే కాకుండా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయనుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జీవో 117 ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్నాహక మార్గదర్శకాలపై.. క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ, నివేధికల సమర్పణ తదితర అంశాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవో 117ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు కూడా విడుదల చేసిందన్నారు. 2 నెలల పాటు క్షేత్రస్థాయిలో కూడా సంబంధిత శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులల్లి, పలువురు మేధావులతో అధ్యయనం చేలాట్టడం జరిగిందన్నారు. సంబందిత అధ్యయనానికి సంబంధించిన నివేదిక రిపోర్టును పరిగణలోకి తీసుకుని.. ప్రభుత్వం సూచించిన ప్రమాణికాల ఆధారంగా జిల్లాలోని పాఠశాలలలో కొంత మార్పును చేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత కొత్తగా జారీచేసే జీవో ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాగా జీవో 117తో ప్రాథమిక విద్యావ్యవస్థకు నష్టం వాటిల్లుతుందని పలువురు ఉపాధ్యాయులు, మేధావులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ప్రతిపాదించారు. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్‌లో ప్రీప్రైమరీ 1, 2 తరగతులు ఉంటాయి. వీటిని మహిళా, శిశు సంక్షేమ శాఖ నడుపుతుంది. ఫౌండేషనల్ స్కూల్‌లో ప్రీప్రైమరీ 1, 2, 12 తరగతులుంటాయి. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో ప్రీప్రైమరీ 1, 2, 1 5 తరగతులు ఉంటాయి. మోడల్ ప్రైమరీ స్కూల్‌లోనూ ప్రీప్రైమరీ 1, 2, 15 తరగతులుంటాయి. వీటిలో ప్రతి తరగతికి ఒక్కో టీచర్ చొప్పున ఉంటారు. ఉన్నత పాఠశాల్లో 610 తరగతులుంటాయి. ఇక ప్రాథమిక పాఠశాలల్లో వేటిని మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చాలో గుర్తించేందుకు మండల స్థాయి, క్లస్టర్ స్థాయిలో కమిటీలను నియమించడం జరిగిందిన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపాలిటీ వార్డుల్లో ఈ స్కూళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి తీసుకురవడం జరుగుతోందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 68 తరగతుల విద్యార్థుల సంఖ్య 30, అంతకంటే తక్కువగా ఉంటే అక్కడి తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, దాన్ని ప్రాథమిక పాఠశాలగా మారుస్తారు. ఈ తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60, అంతకంటే ఎక్కువ ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 30 నుంచి 60 మధ్యలో ఉంటే బడిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారన్నారు. అంతేకాకుండా కొత్త పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల కేటాయింపులోనూ మార్పులు చేయనున్నారున్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మనం తీసుకునే నిర్ణయాలు పిల్లలను నాణ్యమైన విద్యకు దగ్గర చేసే విధంగా ఉండాలన్నారు. ప్రతి మహిళా సమాఖ్య సభ్యురాళ్లు కూడా దాదాపు తల్లుల బాధ్యతను పోషిస్తుంటారు కవట్టి పిల్లల ఆలనా పాలనా చదువు సంధ్య అనేవి ఆయా గ్రామాల్లోని కంటే తల్లులకే బాగా తెలుసునని గుర్తు చేశారు. విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందేంచే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోను ఉపసంహరించే యోచనలో ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే అందరి అభిప్రాయాలను పరిగాణలోకి తీసుకుని విలువైన, న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

గోపవరం, మార్చి 5 ప్రభాతవార్త

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అడ్డుకున్నారు. వివరాలలోకెళితే మైదుకూరు నుంచి చెన్నై వైపు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ డిటి శివశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మైదుకూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీని ఆపి అందులో 700 రేషన్ బియ్యం బస్తాలు కనుగొన్నట్లు ఆయన తెలిపారు. ఈ బియ్యాన్ని శాంపిల్ తీసి ల్యాబ్ కు పంపించడం జరుగుతుందన్నారు. ఈ దాడులలో ఆ శాఖకు చెందిన పలువురు సిబ్బంది పాల్గొన్నారు



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

దువ్వూరు, మార్చి 05, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలోని ఆనకట్ట వద్ద కడప-కర్నూల్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన బాలాయపల్లె నరసింహులు(34), చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన సాకలి గణాద్రి సుబ్బరాయుడు(57) అనే ఇద్దరు పెద్దజొన్నవరం గ్రామం నుండి దువ్వూరుకు వస్తుండగా ఆనకట్ట సమీపంలో జాతీయ రహదారికి ఉన్న డివైడర్‌ను అదుపుతప్పి ఢీ కొన్నారు. దీంతో డివైడర్‌కు ఉన్న రేకులకు తగులుకొని తీవ్ర తాయాలు అక్కడిక్కడే మృతి చెందారు. వీరు మోటార్ సైకిల్‌పై వస్తుండగా అక్కడ నడుచుకుంటూ వెళ్తున్న ఒక వ్యక్తి కూడ గాయాలు అయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. మరణించిన ఇద్దరు తాతా మనవడు అని గ్రామస్థులు తెలిపారు. రోడ్డు ప్రమాద సంఘటనలో మోటార్ సైకిల్‌పై వెళ్తూ డివైడర్‌ను ఒకేసారి ఇద్దరు మరణించడం బాధాకరమైన విశయం. సంఘటనా స్థలాన్ని దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





# అనుమతులు లేని అక్రమ కులాయి కనెక్షన్లు పునరుద్ధరించుకోవాలి

**బద్వేలు రూరల్, మార్చి 5, ప్రభాతవార్త**

ఎవరైనా అనుమతులు లేని అక్రమ కులాయి కనెక్షన్లు ఉంటే తక్షణమే వాటిని పునరుద్ధరించుకోవాలని లేకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన పరిధిలోని అగ్రహారం లో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అలాగే బ్రహ్మా సాగర్ నుండి బద్వేల్ కు సరఫరా చేయు త్రాగు నీటి పరిశీలన లో భాగంగా కమీషనర్ క్లోరిన్ టెస్టు చేసి పలు సూచనలు చేశారు. అన్నీ రకాల జాగ్రతలు తీసుకొని బద్వేల్ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందిస్తున్నాం ఈ నీటిని వృధాగాకుండ త్రాగునీరు మరియు వంటలకు ఉపయోగించుకోవలెనన్నారు.పురపాలక సంఘం వారు అందించే నీరు సర్ పేజ్ వాటర్ మరియు పూర్తిగా ప్రొటెక్టెడ్ వాటర్ ఇందులో మినిరల్స్ కూడా అధికంగా వుంటాయని తెలియజేశారు. అలాగే అక్రమ కుళాయిలు అన్నీ కూడా తక్షణమే రెగ్యులర్ చేయించుకోవాలాన్నారు.అట్లు లేని పక్షంలో కుళాయి కనెక్షన్ లు తొలగిస్తామన్నారు.ఇంటి పన్ను 500 రూ.లోపు వుండి పురపాలక పరిధి లోని చిరునామా కలిగిన రేషన్ కార్డు కలిగి వుంటే 200 రూ.లకే కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా రోడ్డు కట్ చేసినందుకు తక్షణమే వారే మరమ్మత్తులు చేయాలని సూచించారు. లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇంటి పన్నులు నందు వారసుల పేరు మీదకి ఇంటిపన్నులో పేరు మార్పు కోసం, లేటెస్ట్ పన్ను రశీదు మరియు పొజీషన్ సర్టిఫికెట్ ద్వారా మారుస్తామన్నారు. గ్రామ కంఠాలలోని పన్ను లేని ఇళ్లకు తహశీల్దార్ ద్వారా పొందిన పొజీషన్ సర్టిఫికెట్ వున్నట్లయితే ఆ ఇంటికి కొత్తగా పన్ను వేయడం జరుగుతుందన్నారు. ఈయన వెంట మునిసిపల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఖాజా హుస్సేన్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్, మరియు అగ్రహారం సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**గోపవరం, మార్చి 5, ప్రభాతవార్త**

గోపవరం మండలం రాచాయపేట రైతు సేవా కేంద్రం పరిధిలోని బేడుసుపల్లి గ్రామం లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం ఇంచార్జి వ్యవసాయ అధికారిణి మాధురి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వరి, నువ్వులు పంటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. సకాలములో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కాండం తొలుచు పురుగు,పొట్ట కుళ్ల తెగులును గుర్తించారు. నువ్వులు పంట లో మొలక శాతం తక్కువ గా ఉంది.. మొలిచిన మొక్కలు కూడా భూడిద తెగులు తెగులు ను గమనించి విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. వరిలో సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ అనే తెగుళ్ల మందును లీటర్ నీటికి 810 గ్రాములు వొక లీటర్ నీటికి కలిపి. పిచికారి చేయాలి అని సూచించడం. ట్రై కోడేర్మ విరిడి తో విత్తన శుద్ధి, పశువుల ఎరువుతో ఆఖరి దుక్కిలో వేసుకుంటే అన్ని రకాల నేల,విత్తన ఆధారిత తెగుళ్లను నివారించ వచ్చు అని తెలిపారు. రసం పీల్చు పురుగుల నివారణకు జిగురు పూసిన పసుపు తెలుపు పల్లాలు ఎకరాకు కనీసం 20 చొప్పున పొలం లో అమర్చాలి. వరిలో రెక్కల పురుగుల నియంత్రణ, అంచనా కొరకు ఎకరాకు కనీసం 8 లింగాకర్షక బుట్టలు అమర్చడం చేయాలి. సబ్సిడీ కింద 2ఇంచ్ నీటి పైపులు కావాల్సినవారు మీ రైతు సేవకేంద్రం ఇంచార్జి కి మీ యొక్క భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఇస్తే వాళ్ళు పరిశీలించి 13



తేదీలోపు పూర్తి చేయాలి అని సిబ్బందిని ఆదేశించారు. కాలువపల్లె రైతు సేవా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, డిబిటీ, ఎరువుల అమ్మకాలు పరిశించారు రైతు సేవా కేంద్రం లను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రకాల రిజిస్టరు లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలోఇంచార్జ్ వ్యవసాయ అధికారిణి మాధురి, రైతు సేవా కేంద్రం ఇంచార్జ్ ఏఈఓ ఓబయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధ, సుమతి, జ్యోతి, రైతు లు పాల్గొన్నారు.

## ఘనంగా రామ్మోహన్రావు 20వ వర్ధంతి



రామ్మోహన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు

**పీలేరు మార్చి 5 ప్రభాతవార్త:**

పీలేరు డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ నమస్కరించి రాసుకున్న విన్నవము నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు స్వర్గీయ శ్రీ పి రామ్మోహన్ రావు 20వ వర్ధంతి నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ఆదినారాయణ కండక్టర్ అధ్యక్షత వహించడం జరిగింది. సీనియర్ నాయకులు ఎల్లయ్య మరియు కేకే నాయుడు రీజనల్ నాయకులు బి.ఆర్.బి. నాయక్, ఎంహెచ్ నాయుడు మరియు డిపో కమిటీ సభ్యులు రామయ్య. ఈశ్వరయ్య. రామచంద్ర, కే.యస్, రామయ్య, ప్రతాప్, ప్రసాద్, గోపాల్, పి.సి.ఎస్.రెడ్డి, రామయ్య, రామకృష్ణ, హరి మస్తాన్, హరినాథ్, ఎమ్మెస్ నాయక్, గ్యారేజ్ సిబ్బంది ఆనంద, సుబ్బయ్య, నాయక్, మన్యం, మరియు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

## జాతీయ లోక్ అదాలత్పై సమావేశం

**కడప లీగల్, మార్చి 5, ప్రభాతవార్త:**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్, హెగ్డే, కడప అడిషనల్ ఎస్పీ ప్రకాష్బాబు, ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పోలీసు అధికారి భావన, కడప సబ్ డివిజనల్ పోలీసు అధికారి వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## పులివెందుల సబ్జైలు విజిట్

**కడప లీగల్, మార్చి 5, ప్రభాతవార్త:**

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ పులివెందుల సబ్ జైలును బుధవారం విజిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించి అనంతరం ప్రసంగిస్తూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలిపారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సమితిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడపను సంప్రదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లు కలిసిన మాజీ ఎమ్మెల్యే

**పోరుమామిళ్ల రూరల్, మార్చి 5ప్రభాతవార్త:**



వినతి పత్రం ఇస్తున్న టిడిపి నేతలు

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితేష్ రెడ్డిలు బుధవారం విజయవాడలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ని కలిసి బద్వేల్ నియోజకవర్గం లోని ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి చర్చించారు. తెలుగుగంగ కాలువల మరమ్మతులు, చెరువుల అభివృద్ధి పనులు గురించి అలాగే బద్వేల్ పెద్ద చెరువును బ్రహ్మం సాగర్ నుండి ఎల్ఎస్పీ కాలువ ద్వారా నీరు విడుదల చేసి నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఎస్ పి ఛైర్మన్ ఈగ రమణారెడ్డి, కల్లూరు కృష్ణారెడ్డి, ఓ.రమణారెడ్డి పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**బద్వేలు అర్బన్, మార్చి 5 ప్రభాతవార్త**

విధుల్లో అలస్వత్వం వహించిన రామాంజనేయ నగర్ సచివాలయం కార్యదర్శి కోన గిరిబాబు సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని రామాంజనేయ నగర్ సచివాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో వార్డు పరిపాలన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోన గిరిబాబు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరై, ఫోన్ లోకూడా అందుబాటులోకి రాకపోవడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పని కమిషనర్ తెలిపారు. కావున ప్రతి ఉద్యోగి బాధ్యతతో మెలగాలని సూచించారు

## తెగుళ్లు రాకుండా జాగ్రత్త వహించాలి

**దువ్వూరు, మార్చి 05, ప్రభాతవార్త:**



రైతులు రబీ సీజన్లో సాగు చేసిన వివిధ రకాల పంటలకు తెగుళ్లు రాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వేరుశనగ, సొద్ద, కొర్ర, మినుము పంటలను పరిశీలించారు. పంటలకు పలు రకాల తెగుళ్లు ఉన్నాయని సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. యూరియా తక్కువగా వాడి పొటాష్ను ఎక్కువగా వాడాలని తెలిపారు. అలాగే వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు పురుగు మందులు వినియోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలి

**దువ్వూరు, మార్చి 05, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ వసంతకుమార్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సంధబ్బంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వెయ్యి లోపే కూలీలు ఉన్నారని వీటి సంఖ్యను 1500కు పెంచాలన్నారు. వంద పనిదినాల పనులకు దూరంగా ఉన్న కూలీలను గుర్తించి 100రోజుల పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి కూలీకి ప్రతిరోజు 300వేతనం వచ్చే విధంగా అవగాహణ కల్పించారు. నీటి గుంతలు, ఇంకుడు గుంతలు ప్రతి పంచాయతీలో ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమీక్షలో ఈసీ ప్రియాంక, టెక్నికల్, పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉంటే సమస్యలను ఎదుర్కోవచ్చు

**బద్వేల్ అర్బన్, మార్చి 5 ప్రభాతవార్త**

మహిళలు తమకు సంబంధించిన చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వారు పలు సమస్యల నుంచి బయట పడగలరని బద్వేల్ రూరల్ సి.ఐ. నాగభూషణం అన్నారు . బుధవారం శ రాచపూడి నాగభూషణం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులలో అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఆయన కోరారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఎలా వాటిని ఎదుర్కోవాలో ఆయన వివరించారు. సోషల్ మీడియా వేదికగా ఎంతోమంది మహిళలు చాలా రకాలుగా మోస పోతున్నారని, ఈ విషయాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండటమే కాకుండా చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. మహిళలు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్త వహించాలని బద్వేల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కునేందుకు ఆత్మరక్షణ తోపాటు సాధికారత అవసరమన్నారు. శివరాత్రి సందర్భంగా లంకమల, మల్లెం కొండ దేవస్థానాలలో నాగభూషణం కళాశాల ఎ.న్. సి. సి. విద్యార్థులు చేసిన సేవలను గుర్తించి వారిని అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి రాచపూడి సాయికృష్ణ, ఏ. ఎన్. ఓ. బాల ఓబులేష్, డాక్టర్ అశోక్ ,కబీర్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలి

**సుండుపల్లె, మార్చి05, ప్రభాతవార్త:**

మత విద్వేషాలకు అతీతంగా సామరస్యంగా సోదరభావంతో ప్రతి ఒక్కరూ మెలగాలని సుండుపల్లె ఎస్సై ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ముస్లిం మత పెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు వారి ఆచారాల ప్రకారం శాంతియుతంగా కార్యక్రమాలను జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరి మనోభావాలను మరొకరు గౌరవిస్తూ మతసామరస్యానికి ప్రత్యేకగా నిలవాలని ఆయన తెలిపారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరూ స్నేహభావం, సోదర భావంతో సామరస్యంగా ఒక్కటిగా ఉండాలని తెలియజేశారు. కొందరు యువకులు రోడ్లమీదకి వచ్చి రాత్రిపూట ద్విచక్ర వాహనాలతో రైడింగ్ లు చేయడం, అనవసరంగా రాత్రి సమయాలలో ఆలస్యంగా తిరగకుండా సమయపాలన పాటించే విధంగా తల్లిదండ్రులు పిల్లలకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కలికిరి, మార్చి 5, ప్రభాతవార్త:**

ప్రభుత్వం 2019-2024 మధ్య ఇళ్లు మంజూరై వివిధ స్థాయిలో ఉన్న హౌసింగ్ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలికిరి మండలం హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హౌసింగ్ ఏఈ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం పునాది, గోడలు, మోడలింగ్ దశల వరకు ఉన్న ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50వేలు అదే విధంగా ఎస్టీకు రూ.70వేలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కావునా ఎస్సీ, ఎస్టీ మరియు బీసీ లబ్ధిదారులు వారి కుల ధ్రువీకరణ పత్రాలను ఒరిజినల్ కాపీలను ఏఈ హౌసింగ్ కార్యాలయంలో కానీ, లేక సచివాలయం వద్ద గల ఇంజినీరింగ్ అసిస్టెంట్ వారికి 2, 3 రోజుల్లో అందజేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. అలాగే మీకు మీ ఇంటికి కావాల్సిన సిమెంటు కమ్మీ గోదాములో ఉన్నాయని తెలిపారు.

## సర్వేని సద్వినియోగం చేసుకోవాలి

**కలికిరి, మార్చి 5, ప్రభాతవార్త:**

ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఐటీ మరియు ఇతర ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశాలను మరింత ప్రోత్సహిస్తోంది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రానికి చెందిన వేలాది మంది యువతకు స్వగ్రామంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ద్వారా కలిగే ప్రయోజనాలు, సవాళ్లు, అవసరమైన మౌలిక వసతులు వంటి అంశాలు ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన లభించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు.

## మంత్రిని కలిసిన జమ్మలమడుగు ఎమ్మెల్యే



**జమ్మలమడుగు, మార్చి 5, ప్రభాతవార్త:**

గండికోట డ్యాం నిర్మాణం నిమిత్తం భూములు కోల్పోయిన మునక వాసుల సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడును విజయవాడలోని వారి కార్యాలయంలో బుధవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు ఎన్డీఏ కూటమి ఇన్ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, కొండాపురం మండలం ఇన్ఛార్జి చదిపిరాళ్ల నారాయణరెడ్డిలు కలిసి సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో ఆర్అండ్ఆర్ కమిషనర్ శ్రీ సాయి ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు, ముంపునకు గురైన 22 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కన్నెలూరులో ఐడబ్ల్యూడీ, ఈసీసీడీపై అవగాహన



**జమ్మలమడుగు, మార్చి 5, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం (ఐడబ్ల్యూడీ), ఎర్లీ చైల్డ్ వుడ్ ఎడ్యుకేషన్ డే (ఈసీఈడీ) దినోత్సవాల సందర్భంగా జమ్మలమడుగు మున్సిపల్ పరిధిలోని కన్నెలు-2, మరియు 3 అంగన్వాడీ సెంటర్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీడీపీవో రాజేశ్వరి, సూపర్వైజర్ గౌసియా, ఏఎన్ఎం సుబ్బరత్నమ్మ, జీఎం మాబూచాన్లు పాల్గొన్నారు. ఈసీఈడీ మరియు మహిళా దినోత్సవం మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు మహిళా దినోత్సవం కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రతి నెలలో 5వ తేదీ ఎర్లీ చైల్డ్ వుడ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు ప్రతి కేంద్రంలో జరుపుకొంటున్నారు. అందులో భాగంగా సీడీపీవో, ఈసీసీఈ డే రోజు తల్లుల సమావేశంలో పిల్లలకు పోషణ గురించి, ఎస్వీఎం గురించి అనగా బలహీనమైన పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని గురించి ఎత్తు బరువుల గురించి తల్లుల ఎదుట పిల్లలతో పాటు ఆటల పాటల గురించి వివరించడం జరిగింది. అనంతరం సూపర్వైజర్ గౌసియా మహిళా దినోత్సవం గురించి వివరించారు. ఏఎన్ఎం సుబ్బరామ్మ గర్భవతి నుంచి పిల్లలకు వేయించిన టీకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఎస్ మాబూచాన్, గంగాదేవి, మహేశ్వరి, రామలక్ష్మి, మాధవి, ముంతాజ్బేగం, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## యువతే జనసేన పార్టీకి ఊపిరి



**రాజంపేట అర్బన్, మార్చి 5 ప్రభాతవార్త**

జనసేన పార్టీకి యువతే ఊపిరని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఎల్లటూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు.ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించి బుధవారం యువతతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ కోసం యువకులు సైనికులు లాగా పనిచేశారని కొనియాడారు.జనసేనపార్టీ ఆవిర్భావం నుండి అభివృద్ధి వరకు తోడు ఉన్న ప్రతి ఒక్కరు ఈ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జరగనున్న జనసేన 12 వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. జనసైనికులు, వీరమహిళలు అందరూ హాజరై కలిసికట్టుగా పండగ జరుపుకుందామని పిలుపునిచ్చారు.

## ఘనంగా పెండ్యాల రామ్మోహన్రావు 20వ వర్ధంతి

**జమ్మలమడుగు, మార్చి 5, ప్రభాతవార్త:**

నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు రాజీవ్ రత్న అవార్డు గ్రహీత కార్మిక ఆశాజ్యోతి స్వర్గీయ శ్రీ పెండ్యాల రామ్మోహన్రావు 20వ వర్ధంతి సందర్భంగా బుధవారం జమ్మలమడుగు డిపో కార్యదర్శి శివుడు ఆధ్వర్యంలో జమ్మలమడుగు డిపో ఆవరణలో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పెండ్యాల చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీసీవో రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ రామ్మోహన్రావు కార్మికులకు చేసిన సేవలను వారు కార్మిక శ్రేయస్సు కోసం ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ డీఏ, ఎస్ఆర్బీఎస్ మరియు ఎస్బీటీ వంటి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు గౌరవం పెంచిన మహనీయుడని కొనియాడారు. వారి ఆశయాలను పునికి పుచ్చుకొన్న నాయకులు రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర ముఖ్యమ ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి నాయకత్వం వహించడం నిరంతరం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడే నాయకులు నేడు మనకు దొరకడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డెలికేట్ కాంతయ్య, రీజనల్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రామచంద్రుడు, కేఎస్ఎండీ గౌస్, డిపో గ్యారేజీ ఉద్యోగులు పాల్గొన్నారు.



# మాట తప్పడం.. చంద్రబాబు నైజం

**కాశినాయన, మార్చి 5 ,ప్రభాతవార్త**



మాట తప్పడం.. చంద్రబాబు నైజం అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విమర్శించారు. అందుకే ఆయన ఇచ్చిన హామీలేవీ అమలు చేయరని ఆయనపై ధ్వజమెత్తారు. బుధవారం పోరుమామిళ్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు పార్టీ నాయకులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు విధా నాలను తప్పు బట్టారు. హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం... ఆ తర్వాత అధికారమిచ్చిన ప్రజలను అష్టకష్టాలు పెట్టడం చంద్రబాబుకు కొత్తేమీకాదన్నారు. నాడు జగనన్న మంచి చేశారు కాబట్టే నేడు గ్రామాల్లో వైఎస్సార్సీపీ శ్రేణులు కాలరు ఎగరేసుకుంటూ తిరుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు సుందర్ రామిరెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు, పార్టీ సీనియర్ నాయకులు గాజుల పల్లె రవిచంద్రారెడ్డి, లక్కిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, గంగయ్య, గణేష్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



వైద్యశాల నందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

**పీలేరు, మార్చి 05 ప్రభాతవార్తః**

మద్యం సేవించి ప్రభుత్వ వైద్యశాలలో సెక్యూరిటీగా పనిచేస్తున్న వారితో పాటు మద్యం సేవించిన వారిపై చర్యలు తీసుకోవాలని బద్దె భాను ప్రకాష్ డిమాండు చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ వైద్యశాలలో ఎటువంటి అవినీతికి, రోగులకు ఇబ్బంది కలుగకుండా వైద్యాధికారులతో పాటు సిబ్బంది కూడా పనిచేయాలని ఓ వైపు ప్రచారాలు చేస్తుంటే అందుకు విరుద్ధంగా మద్యం మత్తులో పీలేరు ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తూ రోగులపైపెత్తనం చెలాయించడమే కాకుండా దురుసుగా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసమని అటువంటి వారినితక్షణం విధుల నుంచి తొలగించాలని వారు డిమాండు చేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు సాయిసంపత్, ఎబీఎంఎస్ నాయకులు రామాంజులు, వెంకటరమణ, లోకవర్ధన్, వినోద్కుమార్ మాలమహానాడు విద్యార్థి సంఘం నాయకులు మలతోటి నరేష్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ను సందర్శించిన సీఐ

**రామసముద్రం మార్చి 5ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను బుదవారం సీఐతనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలు ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ అసాంఘిక కార్యాక్రమాలకు పాల్పడినా,రౌడీయిజం ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు. పోలీస్ సిబ్బంది ముందుంటారన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ తనిఖీల్లో సీఐతో పాటు ఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్సై జి. రవికుమార్ సీఐ సత్యనారాయణ కు వివరణ తెలియజేశారు. ప్రతిరోజు మా సిబ్బంది తో కలిసి పలు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకమై గ్రామ ప్రజలు ఎలాంటి గొడవలు పెట్టుకోరాదని వారికి సలహాలు ఇస్తున్నామని సీఐకి ఎస్సై తెలిపారు.

## జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

**వేంపల్లి, మార్చి 05, ప్రభాతవార్త :**



జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ కడప పార్లమెంటు సమన్వయ కర్త తాటంశెట్టి నాగేంద్ర పిలుపునిచ్చారు. బుధవారం వేంపల్లి రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న కాకినాడ జిల్లా పరిధిలోని పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు పులివెందుల నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో జనసైనికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇందుకు సంబందించిన పోస్టర్లను జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ తో కలిసి విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పెద్ద పండుగలా జరుపుకునే ఈ సభకు, కేంద్ర స్థాయిలో పార్టీ బలాన్ని చాటి చెప్పే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అధినేత పవన్ కళ్యాణ్ సముచిత స్థానం కల్పిస్తారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమిష్టిగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పులివెందుల సమన్వయ కర్త డాక్టర్ హరీష్, సీనియర్ నేతలు డాక్టర్ రవిశంకర్, లక్ష్మిభరత్, నాయకులు రమణ, బాషా, మహేష్, సాయి, మల్లికార్జున, మురళీ, లక్ష్మినారాయణ, ఉమర్, యువరాజ్, షరీఫ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంపై అక్రమార్కుల కన్ను

**సిద్దవటం, మార్చి 5, ప్రభాతవార్త:**



మండలంలోని ఉప్పరపల్లె గ్రామ శివారుల్లోని ప్రభుత్వ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. శేఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నెంబర్ 421/1, 424లో ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. ఇక్కడ సుమారు 50 సెంట్లను ఇటీవల స్థానికుడు యంత్రంతో చదును చేసి ఆక్రమించాడు. దీనికి నకిలీ పత్రాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణలను అరికట్టి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరారు. ప్రభుత్వ స్థలం కబ్జాపై ఇన్ఛార్జి తహసీల్దార్ మాధవీలతను వివరణ కోరగా స్థలాన్ని చదును చేసిన వారిని గుర్తించి వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**సిద్దవటం, మార్చి 5, ప్రభాతవార్త:**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిద్దవటం ఏఎస్సై సుబ్బరామచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట సీఐ పర్యవేక్షణలో సిద్దవటం ఇన్ఛార్జి ఎస్సై సలహాలతో మార్చి 8న జరుగు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల శక్తి సామర్థ్యాల సంబంధిత కార్య కలాపాలను తెలుపుతూ మహిళలు సమాజంలో విద్య, వైద్య, సాంస్కృతిక రంగాల్లో క్రీడల్లో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు అడుగు వేయాలన్నారు. ఎక్కడైతే మహిళలు గౌరవించడం జరుగుతుందో, పూజించబడుతుందో ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని (యూఎన్ఓ) ఐక్యరాజ్యసమితి 1975లో అన్ని దేశాలలో మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని జాతీయ దినోత్సవాన్ని జరుపుకోవాలని జాతీయ దినోత్సవంగా ప్రకటించారని ఆయన తెలిపారు.

# ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో ముందుండాలి

**పీలేరు మార్చి 5 ప్రభాతవార్త**

ప్రత్యేక ప్రతిభావంతులు (వికలాంగులు) సకలాంగులతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ తెలియజేశారు. విహెచ్పిఎస్ సీనియర్ నాయకులు రామమోహన్ రెడ్డి, చిన్న రెడ్డప్ప, సుభహాన్‌ల కోఆర్డినేషన్లో విహెచ్‌పిఎస్ పీలేరు నియోజకవర్గ సాయి సమీక్ష సమావేశం ఎంఆర్పి ఎస్ సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గ ఎంఎస్‌పి ఇన్చార్జి గండికోట వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల కోసం కుల మతాలకతీతంగా అన్ని వర్గాలను కూడగట్టుకుని వారి హక్కుల కోసం పింఛన్ కోసం గతంలో అలుపెరుగని ఉద్యమాలు చేసి వారికి ప్రత్యేక స్నానాన్ని, రాష్ట్ర ప్రభుత్వం వారికి అందించే పించను పెంపుకు కృషి చేశారని అన్నగారి అడుగుజాడల్లో మరిన్ని ఉద్యమాలు చేసి ఇటువంటి ప్రతిభావంతులకు అండగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం నిలుస్తుందని భరోసా ఇచ్చారు. విహెచ్‌పిఎస్ సీనియర్ నాయకులు రామ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పదిమంది కోసం సామాజిక ఉద్యమాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి మందకృష్ణ మాదిగ అని ఆయన స్ఫూర్తితో నేను పీలేరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పర్యటించి ఎమ్మార్పీఎస్ నాయకుల సహాయ సహకారాలతో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటిస్తూ విహెచ్‌పిఎస్ నాయకుల సమస్యల పరిష్కార దిశగా ఉద్యమిస్తూ విహెచ్‌పిఎస్ నూతన నాయకత్వాన్ని బలోపేతం చేస్తానని తెలియజేశారు. ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గతంలో 2007 సంవత్సరంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ పీలేరు నియోజకవర్గ పరిధి లో ఒంటెద్దు బండ్ల పైన ప్రత్యేక ప్రతిభావంతులతో కలిసి పీలేరు పట్టణ పురవీధులలో నిరసన ర్యాలీ తెలియజేసి అప్పటి రాష్ట్ర రాజధానికి హైదరాబాదుకు పీలేరు నుండి వికలాంగులను అధిక సంఖ్యలో తరలించి విహెచ్పిఎస్ నాయకత్వానికి అప్పుడే బీజం వేశామని మందకృష్ణ మాది ఆధ్వర్యంలో నూతనంగా మరింత నాయకత్వాన్ని బలోపేతం చేసి పీలేరులో వికలాంగుల సమస్యల పరిష్కార దిశగా పయనిస్తూ నూతన నాయకత్వాన్ని బలోపేతం చేసి రాష్ట్రంలోనే పీలేరు నాయకత్వాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, ఎంఆర్పిఎస్ పీలేరు నియోజకవర్గం కో ఇన్చార్జ్ అమరాల వెంకటరమణ, విహెచ్పిఎస్ నాయకులు భాస్కర, అమర్నాథ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, నరసింహులు, రవీందర్ రెడ్డి, ఖాదర్ బాషా, కనకమ్మ, నీరజ, ఎంఆర్పిఎస్ పీలేరు మండలం ఇన్చార్జ్ కిరణ్ కుమార్, కె.వి పల్లి మండలం ఇన్చార్జి రాము, యువ నాయకులు నరసింహ, రాజేష్, అన్నవరం, రాము, గంగాధర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

## వలసల నివారణకు

# ఉపాధి హామీ పనులు చేపట్టాలి

### సబ్ కలెక్టరేట్ వద్ద కార్మిక నాయకులు ధర్నా




దర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 5 ప్రభాతవార్త :**

వలసల నివారణకు ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించాలని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.క్రిష్ణప్ప డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపు మేరకు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలసలు వెలుతున్నారన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇండ్లకు తాళాలు వేసి వలసలు వెళ్ళారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు వేతనం రూ.700లు ఇవ్వాలని, ఏడాదికి 200రోజులు పని కల్పించాలని, జాబ్‌కార్డుతో పని లేకుండా పని అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించి కూలీలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి షేక్ ముభాకర్, పట్టణకార్యదర్శి తిరుమల, అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, మునికాటయ్య, బాలు, లక్ష్మమ్మ, రామప్ప, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుస్కూల్‌చే వినికిడి యంత్రాలు పంపిణీ

**మదనపల్లె, మార్చి 5 ప్రభాతవార్త :**



వీల్‌ఛైర్‌ను అందజేస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో జిల్లా వికలాంగుల, వయోవృద్దుల సంక్షేమశాఖ వారి సహకారంతో వెలుగుస్కూల్ సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి వినికిడి యంత్రాలు, వీల్‌ఛైర్స్‌ను పంపిణీ చేశారు. వెల్ విషర్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీ గిరీషా బుధవారం వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్దాశ్రమంను సందర్శించి దివ్యాంగులు తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్సును చూసి అభినందించారు. అనంతరం తనవంతు సాయంగా ఆయన వెలుగు సంస్థ దివ్యాంగులకు, వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివాజీనగర్‌లో నివాసం ఉంటున్న బధిరుడు సాలాది రమణ, రామ్‌నగర్ లో ఉన్న ధర్మవరం రామాచారి అనే వృద్దునికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. గుర్రంకొండ మండలంలోని ఎల్లంపల్లి నివాసి హరినాథ్‌రెడ్డి అనే దివ్యాంగునికి వీల్‌ఛైర్ అందించారు.

# తవళం గ్రామ పంచాయతీ ఆదాయం



వేలం పాటల్లో పాల్గొన్న అధికారులు

**నిమ్మనపల్లె. మార్చి 5 ప్రభాతవార్త :**

అన్నమయ్య జిల్లాలోని మారుమూల మండలమైన నిమ్మనపల్లెలోని మారుమూల పంచాయితీ అయిన తవళం పంచాయితీలోని కోమిటివానిచెరువు నీలగిరిచెట్లు జిల్లా అధికారులు ఆదేశాలతో బుధవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణంలో జరిగిన వేలం పాటల్లో బాకరాపేటా నివాసి సయ్యద్‌బాషా రూ.27.01లక్షలకు కైవసం చేసుకొన్నారు. ఈ వేలంపాటకు రికార్డు స్థాయిలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్యజిల్లాల నుంచి 24మంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకొక్కరు రూ.2లక్షలు ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డిఎల్‌పిఓ నాగరాజు, డిఆర్ఓ మదహన్‌మోహన్, ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, ఈఓఆర్‌డి చలపతిరావు, ఏఓ రమేష్‌బాబు, సర్పంచ్ రెడ్డప్ప, మండల మాజీ అధ్యక్షులు రాజన్న, మాజీ ఎంపిపి రామక్రిష్ణ, గ్రామ కార్యదర్శి మారప్ప, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, జయరామ్, బిజెపి నాయకులు సోము, టిడిపి నాయకులు శ్రీపతి, కొండవంక చెర్వు అధ్యక్షులు పుంగనూరు రెడ్డప్ప, జయరామ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా 2015-16సంవత్సరంలో మాజీ సర్పంచ్ మద్దెల రెడ్డప్ప హాయాంలో నీలగిరి చెట్ల వల్ల రూ.6లక్షలు గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు తెలిసింది. అందరి సమిష్టి కృషి వల్లే నేడు గ్రామ పంచాయితీకి రికార్డుస్థాయి లభించగా టిడిపి నాయకులు రాజన్న, రామక్రిష్ణ వీరి కృషి ఫలితంగానేనేడు గ్రామ పంచాయితీకి ఆదాయం వచ్చిందన్నారు. ఈనిధులను ప్రభుత్వం ఆదేశాను సారం గ్రామ పంచాయితీలోని గ్రామాలకు అభివృద్ధి పరుచుకొంటామని సర్పంచ్ రెడ్డప్ప ఓ ప్రకటనలో తెలిపారు.

# అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

**పోరుమామిళ్ల రూరల్, మార్చి 5 ప్రభాతవార్త:**

పోరుమామిళ్ల, కలసపాడు, బి. కోడూరు, కాసినాయన మండల విద్యుత్ వినియోగదారులు తమ గృహ విద్యుత్ సర్వీసులకు అనుమతి పొందిన లోడ్ కంటే అదనపు లోడ్ కలిగి ఉంటే స్వచ్ఛంద అదనపు లోడ్ క్రమబద్ధీకరణ క్రింద 1.3.2025 నుండి 30.6.2025 లోగా ప్రస్తుతం ఉన్న డిపాజిట్ రేట్ల లో 50 శాతం చెల్లించి అదనపు లోడ్ అనుమతి పొందవచ్చని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. రవి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తగ్గించిన రేట్ల ప్రకారం ఒక్క కిలో వాట్ కు రూ. 1250, రెండు కిలో వాట్స్ కు రూ. 2450 , మూడు కిలో వాట్స్ కు రూ. 3650 చెల్లించి లోడ్ క్రమ బద్ధీకరణ పొందవచ్చును.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**కొండాపురం, మార్చి 05, ప్రభాతవార్త :**

మండలంలోని ఏటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ ఒక ఎద్దు మృతి చెందినట్లు ఎస్పై హృశికేశవ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. ఏటూరుకు చెందిన రఘ్గావరెడ్డి, నారాయణమ్మలు పొలం వద్దకు ఎద్దుల బండి లో వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ డీ కొన్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదం లో నారాయణమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, ఒక ఎద్దు కూడా మృతి చెందినట్లు ఆయన వివరించారు. ప్రమాదం లో గాయపడిన రాఘవరెడ్డి ని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్పై తెలిపారు.

# దారి సౌకర్యం కల్పించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న పాలకొండ శ్రీనివాసులు

**కలకడ మార్చి 5 ప్రభాతవార్త ;**

మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని అన్నమయ్య జిల్లావిజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు డిమాండ్ చేసినట్టు తెలిపారు బుధవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ ఫణి కుమార్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ గత సమావేశంలో తోటిపల్లి ఎస్సీ కాలనీ నందు కరెంట్ లైన్ క్రిందకు ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కమిటీ సభ్యులు తెలియజేసిన ఇంతవరకు ట్రాన్స్కొ అధికారులు పరిష్కరించకుండా కాలయాపన చేయడం చాలా బాధాకర విషయం అని ట్రాన్స్కొ అధికారులు తీరుపై మండిపడ్డారు. దండు బీడు ఇందిరమ్మ కాలనీ లో అంగన్వాడి కేంద్రానికి, ప్రైమరీ స్కూల్ కు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకొని కబ్జా చేశారని కావున ఆ స్థలాన్ని కబ్జాదారుడు నుంచి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

# పగడ్బందీగా పదవ తరగతి పరీక్షలు



**రైల్వేకోడూరు మార్చి 5 ప్రభాతవార్త**

మార్చి 17వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయని మండలంలో ఆరు కేంద్రాలను 1212 మంది విద్యార్థులు హాజరుకానున్నారని రైల్వేకోడూరు మండల విద్యాశాఖ అధికారి సుందరబాబు తెలిపారు. మొత్తం మండల పరిధిలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశామని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయి బాలాజీ హై స్కూల్ బాబు శ్రీనివాసరాజు, విక్టరీ హై స్కూల్ నరసింహారెడ్డి ,ధరణి స్కూల్ సుకుమార్, గౌరీ శంకర్ గోపి, సిల్వర్ బిల్స్, డాల్ఫిన్ డేల్, తదితర పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు ప్రోత్సహించడం నేరం

**సిద్దవటం, మార్చి 5, ప్రభాతవార్త:**

బాల్య వివాహాలు ప్రోత్సహించడం నేరమని ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.శోభారాణి అన్నారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 పంచాయతీ పార్వతీపురంలోని ఎస్వీ బీవీడీ సభా హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం హైస్కూల్లోని కిశోర బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలు బలహీనతకు గురి కావడం, అనారోగ్యాలకు గల శిశువులకు జన్మనివ్వడం లాంటివి అనేకం జరిగే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలు బాలికల రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకం కాకుండా వారి కళలను సహకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాల వయసు నిండే వరకు వివాహం చేయకూడదని బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం శిక్షించబడతారని వివరించారు. మానసికంగా, శారీరకంగా సంసిద్ధతలేని చిన్న పిల్లలకు వివాహం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు బాలికలకు 18 సంవత్సరాలు, బాలుడికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తున్నట్లయితే ఆ సమాచారాన్ని వెంటనే స్థానిక మహిళా సంరక్షక కార్యదర్శికి కానీ, అంగన్‌వాడీ టీచర్లకు కానీ, పోలీసు వారికి కానీ, 1098 ఛైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరుకు కానీ సమాచారాన్ని అందించాలని ఆమె తెలిపారు. ప్రతి ఒక్క ఆడపిల్ల తప్పనిసరిగా అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లు 100(పోలీస్), 112(దిశ), మహిళా హెల్ప్‌లైన్ 1098 గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మమ్మ, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.



# గడ్డివామి దగ్ధం 50,000ఆస్తి నష్టం

**రామసముద్రం మార్చి 5 ప్రభాతవార్త**

మండలం గుంతలపేట విలేజ్ నుంచ అర్ధరాత్రి అగ్ని ప్రమాద వార్త వచ్చినది వెంటనే సిబ్బందితో ప్రమాద స్థలమునకు వెళ్లి ఎన్. శ్రీనివాస చెందిన వరిగడ్డి వామి అగ్ని ప్రమాదానికి గురైనది వెంటనే సిబ్బందితో సెల్ఫ్ ట్యాంక్ నీటితో మంటలను అదుపు చేయడం జరిగింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టుట వలన అగ్నిప్రమాదం జరిగినట్లు యజమాన్యం తెలియజేయడం జరిగింది. ఈ అగ్ని ప్రమాదం నందు వరిగడ్డి వామి రాతి కూసాలు మరియు ఐరన్ షీట్లుతో కప్పబడిన షెడ్డు అగ్నికి గురి అయినది. నష్టము సుమారు 50,000 రూపాయల వరకు ఉండొచ్చు. సి. సుమన్, ఎం.లోకేష్ రెడ్డి, వి. కేశవ మరియు ప్రకాష్ పాల్గొనడం జరిగింది.

# దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**రామసముద్రం మార్చి5 ప్రభాతవార్త**

మండలంలో గత వారం క్రితం శ్రీవాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు లోకనాథ్ దీక్షిత్ కు అన్యాయం జరిగిన విషయమై మండలం లోని చెంబకూరు చెందిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి మద్దతుకు తెలిపినందుకు అతనిపై భౌతికదాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం మండలంలో పలు ఆలయాల అర్చకులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ అర్చకుల అన్యాయాన్ని ఖండిస్తే దాడి చేయడం సమంజసం కాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని అర్చకులు కోరారు.

# అర్హత కలిగిన రైతులకు పంపిణీ చేస్తాం

**ముద్దనూరు,మార్చి 5, ప్రభాతవార్త:**



మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం క్రింద రాయితీతో వ్యవసాయ పనిముట్లను, బ్యాటరీ స్ప్రేయర్‌లు, పవర్ స్ప్రేయర్‌లను అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న వ్యవసాయ పరికరాలను అవసరమైన రైతులకు రాయితీతో వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు అంది ఉన్నాయని తెలిపారు. ఒక కుటుంబంలో ఒక రైతుకు ఒక పరికరాన్ని మాత్రమే అందిస్తామని తెలిపారు. యస్.సి.,యస్.టి. రైతుల కోటా లో పరికరాలను పొందాలి అంటే తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలి. అలాగే నీటి ఆధారం ఉన్న రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం క్రింద పివిసి పైపులను ఒక్కొక్క రైతుకు 15000/రూపాయలు మించకుండా రాయితీ క్రింద పైపులు అందిస్తున్నామని తెలిపారు. కావున మరిన్ని వివరాలకు రైతులు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలి తెలిపారు. ఈ సదవకాశమును అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు.

# రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీజే నాయకులు

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 5, ప్రభాతవార్త :**

మూవ్‌మెంట్ ఫర్ పీస్అండ్‌జస్టిస్ సంస్థ ఆవిర్భవించి నేటికీ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఎంపీజే సభ్యులు స్థానిక జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇంచార్జ్ ఎండి అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ఎంపీజే సంస్థ పేదలకు పీడితులకు అణగారిన వర్గాలకు మహిళలకు అండగా ఉంటూ ప్రజల్లోకి చురుగ్గా వెళుతున్న సంస్థ, భవిష్యత్తులో ఎంపీజే సంస్థ ఇంకా ప్రజలకు వారి హక్కులను ఇప్పిస్తూ సేవ చేస్తూ ప్రజల మద్దతుతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా ఆసుపత్రి సూపర్డెంట్ ఆనంద్ బాబు మాట్లాడుతూ ఎంపీజే సంస్థ సేవా కార్యక్రమం చేయడం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షులు హుస్సేన్ బాష, ఉపాధ్యక్షులు నజీర్,కార్యదర్శి మహ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి మహమ్మద్ అస్లం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు ముక్తార్, రవి, అల్లా బకాష్, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల బాలికల పాఠశాలకు దరఖాస్తు చేసుకోవాలి

**వాల్మీకిపురం, మార్చి 5 ప్రభాతవార్త :**

స్థానిక ఏపీ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ నవమల్లిక ఒక ప్రకటణలో తెలిపారు. మైనార్టీ బాలికల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు అర్హత గల విద్యార్థినులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థినులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 31లోపు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్. ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు మైనార్టీ గురుకుల పాఠశాలను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# నీరు అనుకొని యాసిడ్ తాగిన యువతి

**నిమ్మనపల్లె, మార్చి 5 ప్రభాతవార్త :**

మండలంలోని బాలోళ్ళపల్లెకు చెందిన ఓ యువతి నీరు అనుకొని పొరపాటున యాసిడ్ తాగి అస్వస్థతకు గురైంది. ఈ విషయం తెలుసుకొన్న కుటుంబీకులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు ఈమెకు మతిస్థిమతం సరిగా లేక ఇంటికే పరిమితమైందన్నారు. ఈ క్రమంలో నీరు అనుకొని ఇంటిలో ఉంచిన యాసిడ్ తాగడంతో తల్లిదండ్రులు జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

# రోడ్డు లేక ఇక్కట్లు

**కడప కార్పొరేషన్ మార్చి 5 ప్రభాతవార్త:**

కడప కేశవరెడ్డి స్కూల్ వెనకవైపు సరస్వతీనగర్ లో రోడ్డు లేక స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. వాహనాలు రాకపోకలు కొనసాగించలేని పరిస్థితి. మరోవైపు డ్రైనేజీ కూడా నిర్మించలేదు. వర్షం కురిస్తే బురుదమయం అవుతుంది. మహిళలు, పిల్లలు, పెద్దలు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదని స్థానిక నివాసస్తులు చెబుతున్నారు. గత కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ హయాంలో రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయి. కానీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు. ఇప్పుడున్న కమిషనర్ మనోజ్ రెడ్డి చొరవ తీసుకొని రోడ్డు, డ్రైనేజీ ని త్వరితగతిన నిర్మించాలని స్థానిక నివాసస్తులు వేడుకుంటున్నారు.

# నాటు సారాతో సహా ఇద్దరు నిందితులు అరెస్టు

**పీలేరు మార్చి 5 ప్రభాతవార్త :**

నాటు సారాతో సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పీలేరు ఎస్పై బాలకృష్ణ తెలిపారు. అందిన సమాచారం మేరకు పీలేరు మండలం, జాండ్ల పంచాయతీ, పచారమాకులపల్లి తండా సమీపంలో తాను తన సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన రమేష్ నాయక్, అతని కుమారుడు శివకుమార్ నాయక్ ఇద్దరు కలిసి మోటార్ సైకిల్ లో నాటు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా వాహనంతో సహా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తయారు చేయడం, విక్రయించడం, రవాణా చేయడం, సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మానవత్వం చాటిన తోటి ఫోటోగ్రాఫర్లు



ఆర్థిక సహాయం అందిస్తున్న ఫోటో వీడియో గ్రాఫర్లు

**మైదుకూరు, మార్చి05, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ బద్వేల్ రోడ్డు రహదారిలో ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌లో చనిపోయిన యర్రబల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ కంచెర్ల.చంటి కుటుంబానికి రూ.1,33,200 ఆర్థిక సహాయం. అతనికి ఇద్దరు కుమార్తెలు, పూజిత (7), ప్రణవి (4) వీరు పుట్టుకతోనే బుద్ధి మాంద్యం, అవయవాలు పురోగతి లేకుండా ఉన్నారు. వారి కుటుంబం కోసం తండ్రి చంటితో పనిచేసిన మైదుకూరు, ప్రొద్దుటూరు ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ తరపున ఆర్థిక సహాయం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మైదుకూరు మరియు ప్రొద్దుటూరు అసోసియేషన్ సభ్యులు అందరూ పాల్గొని వారి కుటుంబానికి భరోసానిస్తూ ఆర్థిక చేయూతనిచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని వారి పిల్లలకు చదువులు నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు వేడుకొన్నారు.

# అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రసంగం అభినందనీయం

### సీపీఐ నాయకులు టీఎల్ వెంకటేష్

**పీలేరు, మార్చి 5 ప్రభాతవార్తః**



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ప్రస్తుతం జరుగుతున్న శాసన సభలో పీలేరు శాసనసభ్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిపలు అంశాలతో పాటు సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లడం అభినందనీయమని నియోజకవర్గ సీపీఐ నాయకులు టీఎల్ వెంకటేష్ అన్నారు. శాసన సభ్యులుగా తమ బాధ్యతలను మరచిపోకుండా జేఎన్‌టీయూ కళాశాల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దష్టికి తీసుకెళ్లడంతో సీఎంతో పాటు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సైతం స్పందించి చదువుమీద దష్టిపెట్టి కళాశాలకు నిధులు మంజూరు చేయడంతో నిలిచిపోయిన పనులు ప్రారంభించినట్లు శాసన సభలో ఎమ్మెల్యే ప్రస్తావించడం అభినందనీయమని,అలాగే నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్‌తో పాటు వంద పడకల ఆసుపత్రి, జేఎన్‌టీయూ యూనివర్శిటీగా మార్చేందుకు విద్యాశాఖామంత్రి హామీఇచ్చినట్లు తెలుస్తుంది. ఇకనైనా ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం పట్ల సీపీఐ పార్టీ కూటమి ప్రభుత్వానికి అండదండగా తోడుగా ఉంటుందని ఆయన అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కార్యక్రమాలకు పాల్పడితే దండన తప్పదు

**పీలేరు, మార్చి 5 ప్రభాతవార్తః**



సీఐ యుగంధర్

పీలేరు సర్కిల్ పరిధిలో అక్రమ కార్యక్రమాలుకు పాల్పడితే ఎంతటివారికైన దండన తప్పదని పీలేరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో పోలీసులగస్తీ ముమ్మరం చేశామని దొంగతనాలు, నాటుసారా, రౌడీయిజం, ర్యాగింగ్ తదితర కార్యక్రమాలపై అనుక్షణంతమ పోలీసులు నిఘా ఉంచారని పోలీసులు కళ్లు కప్పి ఎవరైనా భూముల సెటిల్‌మెంట్లు, దొంగతనాలకు పాల్పడితే ఉన్న టెక్నాలజీతో పాటు సీసీ కెమరాలలో ఫీడు అవుతుందని అందుకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఆయనసూచించారు. పట్టణంలో మంగళవారం జరిగే వారపుసంతలో మహిళలు, దొంగలు పట్ల జాగ్రత్తగా ఉండాలని వేసవి కాలం సమీపిస్తుండటంతో ఇళ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

# అందత్వ నివారణ కార్యక్రమం




**తొండూరు మార్చి 5 (ప్రభాతవార్త):**

జిల్లా అంధత్వ నివారణా కార్యక్రమంలో భాగంగా స్థానిక తొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంటి చూపు తో బాధపడుతున్న 20 మంది విద్యార్థులకు కంటి వైద్యాధికారి జి. వి. లక్ష్మీదేవి కంటి అద్దాలు పంపిణీ చేశారు. విద్యార్థినీ విద్యార్థులు తమ యొక్క కళ్ళను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ అక్షరాలు సరిగ్గా కనబడని వారికి అద్దాలను పంపిణీ చేసి అందత్వం గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. కళ్ళు లేకపోతే జీవితం అగమ్య గోచరంగా ఉంటుందని మానవ శరీరంలో కళ్ళు ఎంతో ముఖ్యమైన వి కావున వీటిని కాపాడుకోవడం మన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు కె.వి.సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ భీరేశ్వర స్వామి, శ్రీ ఉజ్జనేశ్వర స్వామి ఉత్సవాలు

**రామసముద్రం మార్చి 5 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా కురబల ఆరాధ్య దైవమైన శ్రీ సిగేరేశ్వర స్వామి, శ్రీ భత్తేశ్వర స్వామి, శ్రీ బీరేశ్వర స్వామి, శ్రీ ఉజ్జనేశ్వర స్వామి దేవర ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీటీసీ రెడ్డప్ప విన్నవించారు. రామసముద్రం మండలం, పెద్దకురప్పల్లె పంచాయతీ, మట్లవారిపల్లిలో వెలసి ఉన్న శ్రీ సిగేరేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకు జరిగే దేవరలను జయప్రదం చేయాలని తెలిపారు. ఈనెల 5న పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, గజపతి పూజ,6న కలశస్థాపన, 7న రుద్రాభిషేకం, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం, 8న గురుపూజ, ఎద్దు పూజ, రాత్రి 7 గంటలకు ప్రాకోత్సవం, 9న ఉదయం 9 గంటలకు కళ్యాణోత్సవం మధ్యాహ్నం 2 గంటలకు నుండి 4 గంటల వరకు భక్తాదుల తలపై టెంకాయ ప్రమాణము జరుగుతుందని చెప్పారు. రాత్రి 7 గంటలకు దీపారాధన నిర్వహించి దేవరలను ముగింపు చేయనున్నట్లు ఎంపీటీసీ రెడ్డప్ప పేర్కొన్నారు. ఈ దేవరలకు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు రానున్నట్లు చెప్పారు. కురబ కులస్తులకు ఈ దేవరలు ఎంతో మహిమంగా, పవిత్రంగా భావించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# మిట్స్‌లో అశ్వ 2కె25

**కురబలకోట మార్చి 5 ప్రభాతవార్త**



అంగళ్ళు సమీపం లోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల నందు అశ్వ 2కె25 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఘణంగా జరుపుకున్నారు. రెండవ రోజు పాటు కార్యక్రమాన్ని కళాశాల నందు ఘనంగా జరుపుకోవడం హీరోయిన్ నేహా శెట్టి, సింగర్స్ దీపు, హారిక మరియు సమీర బర్ద్వాజ్ లు ఈ కార్యక్రమం లో పాల్గొనడం విద్యార్థులను అలరింపజేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల ద్వారకనాథ్ ప్రెసిడెంట్ ఆర్ ఆర్ ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ మాట్లాడుతూ, విద్యార్థులు కలిసి కట్టుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, వారి సహకారంతో అందరిని ఉత్సాహపరచడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. టీమ్ స్పిరిట్ అనేది ప్రతి విద్యార్థిలోనూ ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. ప్రతి ఒక్కరూ కి తన అభిందనలు తెలియజేశారు. విద్యార్థులకు మరియు అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. సి. యువరాజ్, కన్వీనర్ కమల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం, చెత్తతో సంపద తయారు కేంద్రాల నిర్వహణపై సమీక్ష

**కలకడ మార్చి 5 ప్రభాతవార్త:**
పారిశుద్ధ్య మరియు చెత్తతో సంపాద తయారుచేయ కేంద్రాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు జిల్లా డిపిఓ మస్తాన్ వలి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కలకడ గ్రామము సంపద కేంద్రము నందు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమము ఈవోఅండ్‌పిఆర్‌డిలు, మండల ప్రధాన కేంద్ర పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించియున్నారు. ఈ సందర్భంగా, వారు పారిశుద్ధ్యం మరియు చెత్తతో సంపద తయారు చేయు షెడ్ల నిర్వహణపై సిబ్బందికి శిక్షణనిచ్చారు. అనంతరం, కలకడ గ్రామము సంపద కేంద్రంలో జరిగిన శిక్షణా కార్యక్రమములో డిసిబి, సిసి మరియు చెత్తతో సంపద తయారు చేయు కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల నుండి సేకరించిన చెత్తను తప్పనిసరిగా షెడ్‌కు చేర్చి, నిర్వహణను వేగవంతం చేయాలని ఈవో అండ్‌పిఆర్‌డిలు మరియు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా డిఎల్‌పిఓ, ఈఓఆర్డి డిపిఆర్‌సి టీమ్, మండల ప్రధాన కేంద్ర పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**కురబలకోట, మార్చి 5 ప్రభాతవార్త :**
పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏపి ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ విజయప్రతాప్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మండలంలోని మట్లివారిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రం, ముదివేడు దగ్గరున్న కేజీబివిస్కూల్, పక్కనే ఉన్న మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ముదివేడులోని జడ్పి హైస్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనాలపై ఆరా తీశారు. బాగున్నాయని విద్యార్థులు చెప్పడంతో చదువు ఎంత అవసరమో మంచి ఆహారం కూడా అంత అవసరమన్నారు. ఆహారం బాగుంటే చదువుల్లో బాగుంటూరన్నారు. అన్నం వండిన గంజిని తాగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలను సవాల్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థి జీవితంలో పదోతరగతి కీలకమైందన్నారు. ఉన్నత చదువులకు ఈ మార్కులను బట్టి ప్రవేశం ఉంటుందన్నారు. విద్యార్థి దశలోనే కొత్త ఆలోచనలతో మెలగాలన్నారు. నిర్దిష్టి ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. సమయాన్ని వృధా చేయవద్దన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ముందుగా ఆల్‌బెస్ అని అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహన్ని అందజేస్తామన్నారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

# మహిళల స్వేచ్ఛ సమానత్వ హక్కుల కోసం ఉద్యమించాలి

**ప్రొద్దుటూరు మార్చి 5 ప్రభాతవార్త**
స్వేచ్ఛ సమానత్వం మహిళా హక్కులకై పోరాటాల జాతర మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మహిళలు స్వేచ్ఛ సమానత్వం హక్కుల కోసం ఉద్యమించాలని రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా కరపత్ర ఆవిష్కరణ సృజన కార్యాలయంలో జరిగింది ఈ కార్యక్రమంలో రాయలసీమ మహిళ శక్తి కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలపై శారీరక మానసిక లైంగిక హింస, రోజు రోజుకు పెరుగుతున్న మానభంగాల సంఖ్య ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ఇవి మానభంగాల వరకు ఆగకుండా సదరు మహిళను హత్య చేయడం సాధారణ అయిపోయిందన్నారు. మహిళలను హత్య చేస్తున్న వాళ్ళ క్రూరత్వం ఇంకా ఆందోళన కలిగిస్తోందన్నారు. తమకోసం సంతాన్నాన్ని కని తమ కింద బానిసగా పడివుండవలసిన మహిళలు ఇంటి పరిధిని దాటి స్వేఛ్ఛా వాయువులు పీలుస్తారా? అనే పురుషాధిపత్యం వల్ల మహిళలను చంపడంలో ఇంత క్రూరత్వాన్ని పురుషులు ప్రదర్శిస్తున్నారన్నారు. దీనికి తోడు అటు సినిమాలూ, సీరియళ్ళు మహిళా పాత్రలను విలన్లుగా చిత్రిస్తున్నారున్నారు. ఇందులో మగవాళ్ళను సాధ్యమైనంత బలిష్టులుగా మగతనం ఉ న్నవారిగా ఆడవాళ్ళను బలహీనులుగా చూపడం దురదృష్టకరమన్నారు. ఇలాంటివి అరికట్టటం కూడా సమాజం నేర్చుకోవలసి ఉందన్నారు. ప్రజాస్వామిక పోరాటాల ద్వారా ప్రభుత్వాల ఉదాసీనతనాన్ని పోగట్టవలసి ఉందన్నారు. దానివల్ల పురుషుల్లో మార్పు రావడానికి అన్ని ప్రచారసాధనాల ద్వారా స్త్రీ పురుషులు ప్రకృతి సిద్ధంగా సమానం అనే భావనని నాటవలసి ఉందిన్నారు. అబ్బాయి అమ్మాయి మధ్య వ్యత్యాసం చూపడం తల్లిదండ్రులు ఆపివేయాలన్నారు. వారి ప్రవర్తనలో తేడా పైకి కనబడనీయకుండా నడుచుకోవాలన్నారు. సభ్యురాలు అశ్విని రాయలసీమ మహాసభ కన్వీనర్ రుక్సానా రాయలసీమ విద్యార్థి శక్తి నుండి ప్రసన్న ఉమా ఆదిత్య జగదీష్ వెంకటేష్ ఆనంద్ రాయలసీమ విద్యావంతుల వేదిక నుండి మహమూద్ సుబ్బయ్య దళిత సమాఖ్య నుండి ఎల్లయ్య అంజనమ్మ ప్రగతిశీల కార్మిక సమాఖ్య నుండి శ్రీనివాసులు రెడ్డి నాగేంద్ర జనవిజ్ఞాన వేదిక నుండి సురేష్ సునీత చైతన్య మహిళా సంఘం నుండి పద్మ ఫార్మసిస్ట్ రత్నం మొదలగు వారు పాల్గొన్నారు.



# అందరూ కొత్తవారే.. గిరిజన పిల్లల నోరు కొడతారా!

ఎస్టి గురుకుల మెనూపై కమిషనర్ ఆగ్రహం... ఇన్చార్జికు షోకాజ్ నోటీసులు... రాష్ట్ర ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాపరెడ్డి ఆదేశాలు.


గిరిజన పాఠశాలలో భోజనం తనిఖీ చేస్తున్న కమిషనర్


తంబళ్లపల్లె పౌరసరఫరాల గోడౌన్లో తనిఖీలో కమిషనర్

**తంబళ్లపల్లె మార్చి 5 ప్రభాతవార్త :**
మండలంలో బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాపరెడ్డి గురుకుల పాఠశాలలు, పౌరసరఫరాల నిల్వలు, అంగన్వాడీలపై ఆకస్మిక తనిఖీలతో తన విశ్వరూపం చూపించారు. కమిషనర్ సాయంత్రం తాసిల్దార్ హరికుమార్, ఎంఈఓ త్యాగరాజు, అధికారులతో తంబళ్లపల్లెలోని గిరిజన గురుకుల పాఠశాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి విద్యార్థులకు ఇస్తున్న మెనూపై ఆరా తీసి నిర్వాహకుడు రంగనాయకులను నిలదీశారు. మెనూ విషయమై ఇన్చార్జి చికెన్ 100 గ్రాములు, కోడిగుడ్లు వారానికి నాలుగు ఇస్తున్నట్లు విద్యార్థుల విచారణలో తెలియడంతో ఆగ్రహించారు. నేను కొత్తగా వచ్చాను అని సంజాయిషీ ఇస్తున్న ఇన్చార్జి పై కమిషనర్ నేను కొత్త అందరూ కొత్తే అయితే మారుమూల గిరిజన ప్రాంతాల నుండి వచ్చిన పిల్లల నోరు కొడతారాని నిప్పులు జరిగారు. వెంటనే జిల్లా స్థాయి అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే సంబంధిత ఇంచార్జికి షోకాజ్ నోటీసు పంపించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో భోజనం సౌకర్యం, విద్యా విధానంపై క్రమంగా అడుగుతూ రాగా విద్యార్థులు మూకుమ్మడిగా అన్నిటికీ ఎస్సార్ అనడంతో అన్నిటికీ ఎస్సే నా అని కమిషనర్ చెప్పడంతో నవ్వులు విరిశాయి. కుకింగ్ కమిటీ పైసంతృప్తి చెందినా మెనూ విషయంలో రూల్స్ బుక్ ఎందుకు పాటించరు అది ఎందుకు చెత్తబుట్టలో వేయడానికా అని రేపటినుండి జీవో నెంబర్ ఎంఎస్ 8 ప్రకారం ప్రతి విద్యార్థికి 157.50 గ్రాములు చికెన్, కోడిగుడ్లు, మెనూ సక్రమంగా ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవని సూచించారు. తొలుత కుక్క రాజు పల్లె లో అంగన్వాడి, చౌక దుకాణం రికార్డులు రేషన్ బియ్యం, కందిపప్పు, బాలామృతం, చిన్న పిల్లల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తంబళ్లపల్లె పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లో నిత్యవసర సరుకుల రిజిస్టర్ పౌర సరఫరా, డీలర్ల సమస్యలు పై ఆరా తీసి సంతృప్తి చెందారు. చివరిగా కస్తూరిబా బాలికల గురుకులాన్ని తనిఖీ చేసి పిల్లలు ఏర్పాటు చేసిన భోజనాన్ని తనిఖీ చేసి వంట సిబ్బందిని ప్రశంసించి త్వరలో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని తెలిపారు. అనంతరం బాలికలతో ముఖాముఖి చర్చలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఆడబిడ్డలు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రులకు తద్వారా దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట డిఎస్ఓ రఘురాం, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ రవీందర్ రెడ్డి, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ షమీ, తాసిల్దార్ హరికుమార్, డి . టి భువనేశ్వరి, ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, హెడ్ కానిస్టేబుల్ శంకర, అంగన్వాడి సూపర్వైజర్ రాధమ్మ, వీఆర్వో నాగరాజు, రెవిన్యూ, అంగన్వాడి, పాఠశాల అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా కోదండ రామాలయంలో మహా సంప్రోక్షణ మహోత్సవం

**ఒంటిమిట్ట మార్చి 5 ప్రభాతవార్త**
స్థానిక కోదండ రామాలయంలో బుధవారం శ్రీమద్రామాయణ సహిత సహస్ర కళాభిషేక పూర్వ అష్ట బంధన మహా సంప్రోక్షణ కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది ఆలయ జీర్ణో ధన పనులు చేపట్టి నా నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబర్ 8 నుంచి గర్భగుడిలో సీతారామ లక్ష్మణ మూల వరులా దర్శనం నిలిపివేసి బాలలయం ఏర్పాటు చేశారు రెండు నెలలలో పూర్తి కావాల్సిన పనులు కొంత ఆలస్యంగా పూర్తయ్యాయి పనులు పూర్తి కావడంతో మహా సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజులపాటు హోమాలు నిర్వహణకు విశాలమైన యాగశాలను ఏర్పాటు చేశారు రంగమంటపము ముఖమంటపాలము అంతరాలయము గర్భగుడిని శుభ్రం చేశారు బుధవారము నుంచి ఆదివారం వరకు ఆలయంలో మహా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ మహోత్సవాలకు అంకురార్పణ గావించారు బుధవారం ఉదయం యజమాన సంకల్పం ఆచార్య పూజలు సాయంత్రం 5:30 నుండి ఆలయ ప్రవేశం సభా ప్రార్ధన నిత్యక్షేమారామం యజ్ఞ సంస్కారం రక్షాబంధనం వాస్తు హోమం పరాగ్నికరణం పంచగవ్య ప్రోక్షణం యాగశాల ప్రవేశం ద్వారా తోరణం ధ్వజ కుంభారాధనము పాంచరార్ధగమ సహిత పారాయణము అఖండ దీపారాధన నివేదన బలి మహా మంగళహారతి చాతు మొర తీర్థ ప్రసాదాల వినియోగము కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా అర్చకులు రాజేష్ బట్టర్ ఆధ్వర్యంలో సుమారు 75 మంది పురోహితులు ఈ సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు రాజేష్ బట్టర్ ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు నిర్వహించి మహా సంప్రోక్షణకు బుధవారం సాయంత్రం అంకురార్పణ గావించారు పూజ కైంకర్యాలకు అవసరమైన సామాగ్రిని హైదరాబాదుకు చెందిన వ్యాపారవేత్త పిన్నమనేని బాలమురళీకృష్ణ దంపతులు సుమారు 25 లక్షల రూపాయలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చారు విమాన గోపురం పై రాగి కలశం స్థానంలో బంగారు కలశాన్ని టీటీడీ వాళ్ళు ఏర్పాటు చేస్తున్నారు మహా సంప్రోక్షణ కార్యక్రమంలో సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు చెన్నై బెంగళూరు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వివిధ రకాల పూలను తెప్పించి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికెళ్లను చలువ పందిల్లు ఏర్పాటు చేశారు భక్తులకు అన్నప్రసాదాల ను పంపిణీ చేస్తున్నారు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాటు చేశారు భక్తులకు త్రాగునీరు మజ్జిగ అందుబాటులో ఉంచారు భక్తులు వేడిని తట్టుకునేందుకు అక్కడక్కడ కూలర్లను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆలయ ఇన్స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు





# పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

## రైతు సంఘం కార్యదర్శి రంగారెడ్డి



**రాయచోటి మార్చి 5 ప్రభాతవార్త**
రైతులు పండించిన పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నమయ్య జిల్లారైతు సంఘం కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రం వ్యాప్తంగా జరుగుతున్నటువంటి రైతు సంఘం నిరసనకు మద్దతు తెలియజేస్తూ అన్నమయ్య జిల్లాలో చేయడం జరిగిందన్నారు రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్ ను వెంటనే మంజూరు చేసి రైతులకు అన్నదాత సుఖీభవ కింద 20 వేల రూపాయలు మార్చి నెలలో రైతుల అకౌంట్లో జమ చేయాలని అదేవిధంగా రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని లేదా రైతుల దగ్గర ప్రభుత్వమే కొనుగోలు చేసి వారికి న్యాయం జరిగేలా చేయాలని కోరారు అన్నమయ్య జిల్లాలో ఉన్నటువంటి అన్నమయ్య ప్రాజెక్టును తగిన బడ్జెట్ను కేటాయించి పూర్తి చేయాలని అదేవిధంగా వెలుగల్లు ప్రాజెక్ట్ చిన్న కాలువలు పెద్ద కాలువలు పూర్తిచేసి ఆ కాలువలు కింద ఉన్నటువంటి చెరువులకు నీళ్ల అందించాలని కోరారు ఈ సమావేశంలో రాయచోటి ఏరియా కార్యదర్శి బాలకృష్ణ రెడ్డి అధ్యక్షుడు హరినాధ నాయుడు పాల్గొన్నారు.

# పిల్లలకు సరైన పౌష్టిక ఆహారాన్ని అందిచాలి


తురకపల్లె అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిడిపివో

**లక్కిరెడ్డిపల్లె; మార్చి 05, ప్రభాత వార్త**
పిల్లలకు సరైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు సిడిపివో పద్మావతి పేర్కొన్నారు బుదవారం కోసంపేట సెక్టార్లో అంగన్వాడి కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోపపోషనతో ఉన్న పిల్లలను గిర్తించి వారికి మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. ప్రతి నెల పిల్లలను ఎత్తు,బరువులను పరిశీలించాలన్నారు కడుపులో బిడ్డ బరువు పెరగాలంటే తల్లులు ఆకుకూరలు,గుడ మంచి ఆహారాలను తీసుకోవలని తల్లులకు అవగాహన కల్పించాలన్నారు.0 నుంచి 5 సంవత్సరాల వయస్సు వున్న ప్రతి పిల్లవాడు అంగన్వాడి కేంద్రంలో ఉండాలని వర్కర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వేజర్లు దాద్బీ, లక్కిదేవి, సుజాత అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతపై అవగాహనా సదస్సు




**రాయచోటి మార్చి 5 ప్రభాతవార్త**
జాతీయ మహిళా దినోత్స వ వారోత్స వాల సందర్భంగా అన్నమయ్య జిల్లా అదనపు పోలీసు అధికారి శ్రీ ఎం. వెంకటాద్రి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల(SSITS, రాయచోటిలో బుధవారం నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఐ. రవిశంకర్ రెడ్డి (సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్, రాయచోటి), ఇతర పోలీసు సిబ్బంది, అలాగే పీలేరు, సంపేపల్లి, రామాపురం నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాన అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ ఎం. వెంకటాద్రి మహిళల సాధికారతలో పోలీసు సిబ్బందికి ఉన్న కీలక పాత్రను వివరించారు. మహిళలు తమ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని, దుర్మార్గులను సమాజంలో ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, స్త్రీలను గౌరవించడం మన భారతీయ సంప్రదాయంలో ప్రధాన అంశమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించడమే కాకుండా, వారిని సాంఘిక, ఆర్థిక, మరియు రాజకీయ రంగాలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ విశాలాక్షి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సునీత మరియు అరుణ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# లైన్‌మెన్ సేవలు అభినందనీయం

**బద్వేలు అర్బన్, మార్చి 5 (ప్రభాతవార్త):**
జాతీయ విద్యుత్ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా బద్వేలు పట్టణంలో నిరంతరాయంగా ప్రజలకు విద్యుత్ సేవలందిస్తూ పట్టణంలో పలువురు ప్రజల ఆదరాభిమానాలు పొందిన లైన్‌మెన్‌లు నేలటూరి జయరామిరెడ్డి, వల్లి, నాగసుబ్బారెడ్డితో పాటు పలువురిని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణికృష్ణ పలువురిని అభినందించి శాలువా, పూలమాలతో సత్కరించి వారికి గిఫ్ట్ మరియు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుళాయప్ప, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మేరి షర్మిలారాణి, రూరల్ ఏఈ శివకుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణికృష్ణ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ పురోభివృద్ధిలో లైన్‌మెన్‌ల పాత్ర ఎంతో కీలకమని, ఎండనక, వాననక, ఎప్పుడు ఎక్కడ విద్యుత్ సమస్యలు సంభవించినా లైన్‌మెన్‌లు విద్యుత్ వినియోగదారులందరికీ అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో లైన్‌మెన్ సేవలకు అంతులేదన్నారు. వీరి సేవలను గుర్తించి ప్రతి సంవత్సరం జాతీయ విద్యుత్ లైన్‌మెన్ దినోత్సవం నిర్వహించడం జరిగిందని ఇందులో భాగంగా ప్రజలకు సేవలందించి బద్వేలు లైన్‌మెన్‌లు నేలటూరి జయరామిరెడ్డి, వల్లి, నాగసుబ్బారెడ్డిలను అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు అంతరాయం తలెత్తకుండా ప్రతి నెలలో ఒక రోజు ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేస్తూ మెరుగైన విద్యుత్ అందిస్తూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తినా ఏఈ, ఏడీల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో వారి పాత్ర కీలకమన్నారు.



# కలెక్టర్ ఆదేశాలతో అక్రమ భూములపై రీసర్వే

## తహశీల్దారు భీమేశ్వరరావు



**పీలేరు,మార్చి 5 ప్రభాతవార్త:**
ఆదివారం నుంచి నాలుగు రోజులుగా పీలేరు పట్టణంలోని ఆరు రెవెన్యూగ్రామాలలో సుమారు 50 మంది రెవెన్యూ సిబ్బంది అక్రమ భూములపై అనువణువు రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని ఈసర్వేలో భాగంగా బోదుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, యర్రగుంటపల్లె, పీలేరు-1,2,3 గ్రామాలలో ఉన్న వందల ఎకరాలు అక్రమంగా ఆక్రమించుకుని ఇళ్ల స్థలాలుగా మార్చుకుని అమ్ముకున్నట్లు రాష్ట్ర అధికారులతో పాటు జిల్లా అధికారులకు వందలకొద్ది ఫిర్యాదులు వెల్లడంతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్పందించి ప్రతి సర్వే నెంబరు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు పంపాలని ఆదేశించడంతో ప్రతి గ్రామంలో గతంలో ఉన్న స్థితిగతులతో పోల్చి భూమి వివరాలను ఫోటోలతో సహ అందజేసేందుకు సర్వేకు వచ్చిన ఆరు మండలాల రెవెన్యూ అధికారులు ఎండలకు సైతం లెక్కచేయకుండా సర్వే కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని తహశీల్దారు భీమేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు సుమారు 50 శాతం భూములు రీసర్వే చేశామని మరికొద్ది రోజులలో పూర్తిగా సర్వేచేసి వాటి వివరాలు జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.

# సైబర్ నేరాల గురించి అవగాహన సదస్సు



**పెనగలూరు, మార్చి 5 ప్రభాతవార్త:**
మండల కేంద్రంలో ఉన్నటువంటి పెనగలూరు స్టేట్ బ్యాంక్ నందు పెనగలూరు బ్రాంచ్ మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, ఫేక్ ఫోన్ కాల్స్ పట్ల వ్యవహరించాల్సిన తీరు పైన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, అలాగే విశ్రాంత ఉద్యోగులు పంతగాని వెంకటస్వామి, రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

# పుష్ప పల్లకిపై అమ్మవార్లు ఊరేగింపు

**రామసముద్రం మార్చి 5 ప్రభాతవార్త**



మండల భార్డర్ వెలిసిన రామలింగేశ్వర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి, చౌడేశ్వరి అమ్మవారికి మొదటపూజలు చేసి పలు రకాల పుష్పాలను తెచ్చి కర్గాను పూజారి అలంకరణ చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకరగా వేడుకను తిలకించడానికి ఆంధ్ర తమిళనాడు,తెలంగాణ రాష్ట్రల నుండి భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 7గురు అమ్మవార్లు పుష్ప పల్లకి పై పురవీధుల్లో ఊరేగింపు చేశారు. కర్గాను, పుష్పపల్లకి తిలకించడానికి వచ్చిన భక్తులకు గ్రామ పెద్దలు వివిధ పార్టీ నాయకులు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

# మతాలను అడ్డం పెట్టుకోని సంఘ విద్రోహ శక్తులుగా చలామణి అవుతామంటే విడిచిపెట్టే ప్రసక్తే లేదు

**రాయచోటి మార్చి 5 ప్రభాతవార్త**



వీరభద్ర స్వామి పారువేట సందర్భంగా హిందూ సంఘాలు చేరి అనవసర వ్యాఖ్యలు రెచ్చగొట్టే విధంగా చేశారు. అదేవిధంగా ముస్లింలు కూడా జంక్షన్ వద్ద ఊరేగింపును అడ్డుకోవడంతోపాటు పోలీసులు మమ్మల్ని మోసం చేశారంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇరు వర్గాల్లో అకతాయిలు మత పెద్దల మాటలు వినకుండా పోలీసులపై రెచ్చిపోయారు. దాదాపు 1000 మంది చెప్పులు విసరడం, రాళ్లు రువ్వడం చేశారు. కాబట్టి వారిపైన ఇరు వర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. డ్రోన్ కెమెరాలతో ఆకతాయిలను గుర్తించాం. లాఠీచార్జిలో పోలీసులతో సహాచాలామందికిగాయాలయ్యాయి. ఈ సంఘటనపై పుకార్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ఏడాది హిందూ ముస్లింలు కలిసిమెలిసి వీరభద్ర స్వామి ఉత్సవాలు, ముస్లింల పండుగలు జరుపుకుంటూ వచ్చారు. ఈమధ్య హిందూ, ముస్లిం మత సంస్థలు ఏర్పాటు చేసుకుని పోరాటాల పేరుతో తమ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వారి వల్ల ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతుంది. ఇటువంటి వారిపై పిడి యాక్టు లు నమోదు చేస్తాం, జిల్లా బహిష్కరణ కూడా చేస్తాం అని ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

# గోటితో తలంబ్రాలు



**వేంపల్లి, మార్చి 05, ప్రభాతవార్త :**
పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో స్వామివారి తలంబ్రాలకు సేంద్రీయ వ్యవసాయంతో పండించిన వడ్లను వేంపల్లె శ్రీ మంగళగౌరీ దేవస్థానంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో మహిళలు గోటితో వొలిచి తలంబ్రాలను తయారు చేశారని బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళ్ళాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆలయంలో గౌరీదేవి అష్టోత్తరాలు, లలితసహస్ర నామాలు, శ్రీ రామ సంకీర్తనలతో భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజా రామ్, మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలమ్మ, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు పచ్చి పులుసు ప్రవీణ, నంబూరు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌తో ఎంపి మేడా రఘునాథరెడ్డి భేటీ

## ప్రజా సమస్యలపై గళం విప్పాలని సూచన

**రాజంపేట అర్బన్, మార్చి 5 ప్రభాతవార్త**



ప్రజల కోసం రాజ్యసభలో పార్టీ తరపున గళంవిప్పి పార్టీ వాణిని వినిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎంపి మేడా రఘునాథరెడ్డికి సూచించారు. బుధవారం తాడేపల్లిలో జగన్‌తో మేడా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ వ్యూహంపై చర్చించారు. రాజ్యసభ సభ్యులుగా రాజ్యసభలో పార్టీ నేతగా వ్యవహరించిన విజయ్‌సాయిరెడ్డి పార్టీకి రాజీనామా చేసిన తర్వాత గురువారం జరగనున్న సమావేశంలో అనుసరించే విధానంపై మాట్లాడినట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ అధినేత జగన్ సూచించినట్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో చర్చలో పాల్గొని ప్రధాన సమస్యలను పెద్దల సభ దృష్టికి తీసుకెళ్లినట్లు రంగారెడ్డి వివరించారు. అలాగే స్టాండింగ్ కమిటీలో కూడా రాష్ట్ర సమస్యలను వివరించినట్లు తెలిపారు.